జలము నిశ్చయంబు

- ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు
- జల్‌జీవన్ మిషన్ పథకంలో కింద రూ.10 కోట్ల కేటాయింపు
- జోరుగా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులు



కృష్ణవరంలో జల్‌జీవన్ మిషన్ నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు (ఫైల్)

కిర్లంపూడి: మెట్ట ప్రాంతమైన జగ్గంపేట నియోజక వర్గంలో ఇక తాగునీటి సమస్య తీరనుంది. ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జల్ జీవన్ మిషన్ పథకంలో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి రక్షిత తాగునీరు అందించనున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే పలు చోట్ల రక్షిత మంచినీటి ట్యాంకులు, బోర్లను అందుబాటులోకి తీసుకు వచ్చారు.

వివరాలు నమోదు చేసి...

జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయిల ద్వారా పరిశుభ్రమైన నీటిని సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామాల్లో కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా అవుతున్న వారి వివరాలు, ఇంకా ఎన్ని కుటుంబాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వాలనే వివరాలు సేకరించారు. అందుకు అనుగుణంగా నిధులు కేటాయించారు. గ్రామాల్లో ఇప్పటికే ఉన్న రక్షిత మంచినీటి పథకాలు, వాటి సామర్థ్యం తదితర వివరాలను నమోదు చేశారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా రక్షిత మంచినీటి పథకాలు, బోర్లు ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలను సైతం అధికారులు గుర్తించి పనులు ప్రారంభించారు.

మూడు దశల్లో పనులు

కిర్లంపూడి మండల పరిధిలోని గ్రామాల్లో ఇంటింటా సుమారు 6 వేల కుళాయిల ఏర్పాటుకు జల్‌జీవన్ మిషన్ ద్వారా సుమారు రూ.10 కోట్లకు పైగా నిధులు కేటాయించారు. కొన్ని గ్రామాలకు సంబంధించి టెండర్లు పూర్తికాగా మరికొన్ని చోట్ల టెండరింగ్ పనులు జరుగుతున్నాయి. మండలాన్ని రెండు ఫేజ్‌లుగా విభజించారు. ఫేజ్–1లో 14 పనులకు గాను రూ.6 కోట్లు కేటాయించారు. ఫేజ్–2లో 17 పనులకు సంబంధించి రూ.3.2 లక్షలకు టెండర్ల ప్రక్రియ జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి తాగునీటి సమస్య రాకుండా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

తాగునీటి కష్టాలకు చెక్



జల్‌జీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు అభినందనీయం. గ్రామాల్లో వసతుల కల్పనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. జల్‌జీవన్ మిషన్‌తో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తీరుతాయి.

–తోట సత్యవతి, జెడ్పీటీసీ, కిర్లంపూడి

చురుగ్గా పైపులైన్ పనులు



జల్‌జీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ రక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పటికే కొన్ని చోట్ల వాటర్ ట్యాంకులు నిర్మించాం. ప్రస్తుతం గ్రామాల్లో పైప్‌లైన్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అవసరమైన చోట బోర్లను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాం.

– బండారు అప్పలరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజినీర్

అసంపూర్తిగా తాగునీటి ట్యాంకులు

- ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై మండిపడిన ప్రజాప్రతినిధులు
- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గౌతమ్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు

కోటనందూరు: మండలంలోని అనేక గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు అసంపూర్తిగా ఉండిపోయాయని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటనందూరు, జగన్నాథపురం తదితర గ్రామాల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. కాకరాపల్లి జగనన్న లే అవుట్‌లో మూడు నెలల క్రితం బోరు తవ్వినా..దానికి మోటారు బిగించి నీటిని సరఫరా చేయలేకపోతున్నారని మండిపడ్డారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మండల వ్యాప్తంగా చెరువుల్లో ఆక్రమణలు చోటు చేసుకున్నాయని, రీ సర్వేలో చెరువుల బౌండరీలు నిర్ధారించి ఆక్రమణలు తొలగించాలని తహసీల్దార్ కుశరాజును కోరారు. జేఎల్ఎంల పనితీరు అధ్వానంగా ఉందని, ప్రజాప్రతినిధుల మాటలను సైతం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పనితీరు సరిగా లేని జెఎల్ఎంలపై చర్యలు తీసుకోవాలని విద్యుత్ ఏఈ లోవరాజుకు సూచించారు. మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. తాండవలో కేవలం 25 రోజులకు సరిపడా నీటినిల్వలు మాత్రమే ఉన్నాయని, సాగునీటిని పొదుపుగా వాడుకునే విధంగా రైతులను ప్రోత్సహించాలన్నారు. వైద్యురాలు డాక్టర్ యామిని కావ్య మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే జరుగుతుందని, దీనిని ప్రజలంతా సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. విద్య, ఉపాధి, పంచాయతీరాజ్, ఐసీడీఎస్, విద్యుత్, పశువైద్య, హార్టికల్చర్ శాఖల పనితీరును ఎంపీపీ శ్రీనివాసు సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. మండల సర్వసభ్య సమావేశానికి హాజరు కాని అధికారులను వివరణ కోరాలను ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, కో ఆప్షన్ సభ్యుడు జిగటాల కోటసత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మండల సమావేశం

తుని రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పి.రవికుమార్ సోమవారం తెలిపారు. ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అధ్యక్షతన జరిగే సమావేశంలో వివిధశాఖల పనితీరు, ప్రగతిపై చర్చిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

కరువు మండలంగా ప్రకటించాలని వినతి



తునిలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

తుని రూరల్: తీవ్ర వర్షాభావం నెలకొన్న తుని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రైతు సంఘ ప్రతినిధులు, సీఐటీయు నాయకులతో కలసి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అచ్చుతరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కరువు సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యామ్నాయ వ్యవసాయ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలన్నారు. వర్షాభావంతో పంటలు దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.40 వేలు, పంట వేయని రైతులకు రూ.20 వేలు చొప్పున పరిహారం చెల్లించాలని కోరారు. సంఘ నాయకులు నక్కెళ్ల శ్రీనివాసరావు, బత్తిన నాగేశ్వరరావు, ఎస్‌కే పద్మ, సత్యకళ, తదితరులు పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి



యర్రవరంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరంలో బీజేపీ వ్యవస్థాపక అధ్యక్షుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాత వాద సిద్ధాంత కర్తగా, అంత్యోదయ స్ఫూర్తి ప్రదాతగా దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దీనదయాళ్ సిద్ధాంతాల స్ఫూర్తితోనే పరిపాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సింగిలిదేవి సత్తిరాజు, దాకే కృష్ణారావు, కర్రి ధర్మరాజు, కందా వీరాస్వామి, బండారు సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం

గోకవరం: స్థానిక వీరభద్రుని గద్దెలో కొలువైన కనకదుర్గమ్మ ఆలయం వద్ద దసరా ఉత్సవాలకు సోమవారం పందిరి రాట వేశారు. అర్చకులు ప్రవీణ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ అక్టోబర్ 15 నుంచి తొమ్మిది రోజుల పాటు శరన్నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అక్టోబర్ 25న అమ్మవారి ఊరేగింపు, 27న భారీ అన్న సమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఉత్సవాల నిర్వహణకు భక్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బత్తుల నానాజీ, ఆలయ కమిటీ అధ్యక్షుడు వాకచర్ల రవి, ముమ్మిడివరపు గొల్లబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న కల్యాణోత్సవం



విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి తిరు కల్యాణోత్సవం సోమవారం వైభవోపేతంగా జరిగింది. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి అమ్మవార్లకు అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తిరు కల్యాణోత్సవాన్ని తిలకరించారు.

నేడు జన్మనక్షత్ర పూజలు

వేంకటేశ్వరస్వామి తిరునక్షత్రం శ్రవణం సందర్భంగా మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు అర్చకులు తెలిపారు. 108 కలశాల పంచామృతాలతో స్వామివారికి అభిషేకం నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష మాక్ డ్రిల్

ప్రత్తిపాడు: స్థానిక లయన్స్‌క్లబ్ కమ్యూనిటీ హాలు ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష మాక్ డ్రిల్ నిర్వహిస్తామని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, సర్పంచ్ గుడాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. మండల స్థాయి అధికారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు కోరారు.

ఆటో బోల్తా

ఏడుగురికి స్వల్పగాయాలు



క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

గండేపల్లి: జాతీయ రహదారిపై మండలంలోని తాళ్లూరు శివారులో సోమవారం ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే...అనకాపల్లి జిల్లా అడ్డురోడ్డు నుంచి ఆటోలో ఆరుగురు ప్రయాణికులు రాజమహేంద్రవరం వెళుతున్నారు. మండలంలోని తాళ్లూరు శివారు దాబాల వద్దకు వచ్చే సరికి యల్లమిల్లి నుంచి ప్రయాణికులతో జగ్గంపేట వచ్చేందుకు మరో ఆటో డివైడర్ వద్ద రోడ్డు దాటుతోంది. వెనకే వస్తున్న అదే గ్రామానికి చెందిన మోటార్ సైకిలిస్టు రోడ్డుపైకి రావడంతో రాజమహేంద్రవరం వైపు వెళుతున్న ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఆరుగురికి, మోటార్ సైకిలిస్టుకు గాయాలయ్యాయి. హైవే సేఫ్టీ సిబ్బంది కుమార్, సతీష్ స్థానికుల సహాయంతో క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ప్రమాదంపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని గండేపల్లి పోలీసులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



గోకవరంలో ప్రకృతి ఉత్పత్తుల స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీవల్లి, జెడ్పీటీసీ శ్రీరంగ

గోకవరం: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ అన్నారు. గోకవరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రదర్శించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను సోమవారం వారు ప్రారంభించారు. ఈ స్టాల్‌లో ఎరువులు వేయకుండా సహజ సిద్ధంగా పండించిన కూరగాయలు, బియ్యం, అరటిపండ్లను ప్రదర్శించారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, ఎంపీడీఓ పద్మజ్యోతి, రైతు కొరిపల్లి అప్పలస్వామి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ చారిత్రాత్మకం

- ఎంపీపీ సుంకర శ్రీవల్లి
- గోకవరంలో పీఎం మోదీ, సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



గోకవరంలో పీఎం మోదీ, సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

గోకవరం: చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు ఆమోదించడం చారిత్రాత్మకమని ఎంపీపీ సుంకర శ్రీవల్లి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు రెండేళ్ల పదవి పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, ఎంపీడీఓ పద్మజ్యోతి ముఖ్యఅతిథిలు పాల్గొన్నారు. తొలుత ఎంపీపీ కేక్ కట్ చేసి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని, పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సభ్యులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేస్తూ పీఎం మోదీ, సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు మడికి మైనర్ బాబు, గోకాడ చిట్టిబాబు, ఎంపీటీసీలు తోలేటి రమ్యశ్రీ, ఉనుకూరి ఆసిరమ్మ, నరాలశెట్టి గౌతమి, పాటి నాగమణి, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన టిప్పర్ లారీ

శంఖవరం: స్థానిక పాత స్టేట్‌బ్యాంక్ సమీపంలో విద్యుత్ స్తంభాన్ని సోమవారం టిప్పర్ లారీ ఢీకొట్టింది. రౌతులపూడి నుంచి కత్తిపూడి వెళుతున్న టిప్పర్ లారీ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టగా పెను ప్రమాదం తప్పింది. గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం తెలుసుకుని విద్యుత్ శాఖ అధికారులు సమస్యను పరిష్కరించారు.

తెగుళ్ల నివారణతో అధిక దిగుబడులు



టి.తిమ్మాపురంలో పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

తుని రూరల్: పత్తి పంటను ఆశించే తెగుళ్లు, పురుగులను సకాలంలో గుర్తించి నివారిస్తే నాణ్యత గల అధిక దిగుబడులు సాధించవచ్చని పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎ.సీతారామశర్మ అన్నారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ నరసింహారావు, ఏడీఏ సుంకర బుల్లిబాబు, ఏఓ బి.అశోక్‌కుమార్తో కలసి సోమవారం ఆయన టి.తిమ్మాపురంలో పర్యటించారు. పత్తి చేలను పరిశీలించారు. పత్తి పంటను రసం పీల్చు, కాయ తొలుచు పురుగులు ఆశిస్తున్నట్టు తెలిపారు. రైతులు ఎప్పటికప్పుడు పంటను పరిశీలించుకోవాలన్నారు. సకాలంలో తెగుళ్లను గుర్తించి నివారించుకోవాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యుడు ఎస్.నాగేశ్వరరావు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

శంఖవరం: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులందరూ తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. మండలంలోని జి.కొత్తపల్లి, వి.వెంకటాపురం, అచ్చంపేట గ్రామాల్లో సోమవారం వరి పంటలకు ఈ–క్రాప్ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏఓ గాంధీ మాట్లాడుతూ రైతులు ఈ–క్రాప్ నమోదు చేసుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే రైతుల భరోసా, పంట నష్టపరిహారం తదితర పథకాలు పొందవచ్చన్నారు. రైతులు తప్పకుండా ఈ–క్రాప్, ఈ–కేవైసీ నమోదు చేయించుకోవాలని సూచించారు.


విజయ గణపతిగా దర్శనమిచ్చిన వినాయకుడు



రౌతులపూడిలో దీపారాధన చేస్తున్న మహిళలు



రత్నగిరిపై విజయ గణపతి అలంకరణలో స్వామివారు



ఏలేశ్వరంలో కరెన్సీ నోట్లతో గణపతి విగ్రహం

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో గణపతి నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం స్వామివారు విజయ గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. శంఖం, విల్లు, గధ, బాణం తదితర ఆయుధాలు ధరించి గణపతి భక్తులను అలరించారు. పండితులు ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు గణపతికి పుష్పాలు, గరికతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆకట్టుకుంటున్న కరెన్సీ నోట్ల గణపతి

ఏలేశ్వరం: గణపతి నవరాత్రుల్లో భాగంగా పట్టణంలో కరెన్సీ నోట్లతో ఏర్పాటు చేసిన గణపతి భక్తులను ఆకట్టుకుంటున్నాడు. స్థానిక మార్కెట్ రోడ్‌లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రూ.10, రూ.20 నోట్లు సుమారు రూ.2 వేలతో గణపతి విగ్రహాన్ని అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు గణపతిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్నారు.

రౌతులపూడిలో అఖండ దీపారాధన

రౌతులపూడి: వినాయక చవిత ఉత్సవాల్లో భాగంగా స్థానిక సత్యదేవా కాలనీలోని వినాయక మండపం వద్ద సోమవారం రాత్రి అఖండ దీపారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దీపారాధన చేశారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు

కిర్లంపూడి: వినాయక చవితి మహోత్సవాలను పురస్కరించుకుని సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. కిర్లంపూడి ఏనుగువీధి రామాలయం వద్ద, రమణయ్యపేట, జగపతినగరం శెట్టిబలిజపేట వినాయకుని ఆలయాల వద్ద అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. స్థానిక, పరసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆయా ఆలయ కమిటీల సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెద్దనాపల్లిలో...

ఏలేశ్వరం: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పెద్దనాపల్లిలో సోమవారం అన్నదానం నిర్వహించారు. స్థానిక సూర్యనారాయ స్వామి ఆలయం వద్ద వందలాది మందికి అన్నదానం చేశారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నదానంలో పాల్గొని వడ్డన చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

ప్రత్తిపాడు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ బీసీ హాస్టల్ వీధిలో మహిళలు ప్రతిష్ఠించిన గణపతి ఆలయం వద్ద సోమవారం అన్నదానం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, వసతిగృహ సంక్షేమాధికారి జె.సాయిసూర్యలక్ష్మి పాల్గొని వడ్డన చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

రౌతులపూడి: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా రౌతులపూడి, బీబీపట్నం గ్రామాల్లో సోమవారం అన్నసమారాధనలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలు



తుని సాయినగర్‌లో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: గత ప్రభుత్వ హయాంలో పథకాలు కావాలంటే నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల చెంతకే పథకాలు అందుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక 30వ వార్డులో సోమవారం కౌన్సిలర్ సిద్ధిరెడి గౌరి వనజ ఆధ్వర్యంలో మన మున్సిపాలిటీ మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పరంగా ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. అర్హత ఉండి పథకాలు రాకపోతే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్థానికులు పలు సమస్యలను వీరి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని చైర్‌పర్సన్ సుధారాణి కమిషనర్ ప్రసాదరాజును ఆదేశించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

800 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు మందులు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత, అధ్యాపకులు



జగ్గంపేటలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీపీ నాగబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు

తుని రూరల్: మండలం వి.కొత్తూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, హెల్త్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తేటగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె.అన్వేషి ఆధ్వర్యంలో సిబ్బంది 800 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వరల్డ్ ఫార్మాసిస్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత మాట్లాడుతూ వర్షాలు కురవడంతో పరిశుభ్రత లోపించి డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు, చర్మ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసు, ఎన్ఎస్ఎస్ పీఓ ఢిల్లేశ్వరరావు, అధ్యాపకులు శ్రీధర్, రామ్మూర్తి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫార్మసీ డే

జగ్గంపేట: ఆరోగ్య వ్యవస్థలో ఫార్మాసిస్టు పాత్ర ఎంతో కీలకమని ఆదర్శ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ త్రినాథ్ అన్నారు. ప్రపంచ ఫార్మసీ డే సందర్భంగా జగ్గంపేటలో సోమవారం గోకవరం మండలం యు.కొత్తపల్లికి చెందిన ఆదర్శ కాలేజీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ర్యాలీని ఎంపీపీ అత్తులూరి నాగబాబు, వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా జెండా ఊపి ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ త్రినాథ్ ప్రపంచ ఫార్మసీ దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఆదర్శ ఫార్మసీ కళాశాల చైర్మన్ పి.కనకరాజు, హెచ్ఓడీ కిరణ్, కళాశాల లెక్చరర్లు పాల్గొన్నారు.

నేడు రైతులకు అవగాహన సదస్సు

జగ్గంపేట: ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు విద్యుత్ భద్రతపై మంగళవారం గండేపల్లి మండలం జెడ్.రాగంపేటలో పరిణయ ఫంక్షన్ హాల్‌లో అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు జగ్గంపేట ఎలక్ట్రికల్ డీఈ రత్నాలరావు తెలిపారు. సాయింత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సుకు రైతులందరూ తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

అరెస్టులకు నిరసనగా ర్యాలీ

తుని: సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ చేపట్టిన నేపథ్యంలో అంగన్‌వాడీ సిబ్బందిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం, నిర్బంధించడం అప్రజాస్వామికమని సీఐటీయూ మండల కార్యదర్శి నెక్కళ్ల శ్రీనివాసు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం సీఐటీయూ ప్రతినిధులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి గొల్లప్పారావు సెంటర్ వరకూ ర్యాలీ చేశారు. అక్కడ మానవహారంగా ఏర్పడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అంగన్‌వాడీల ఆందోళన

ప్రత్తిపాడు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రత్తిపాడులో సోమవారం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఆందోళన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం స్థానిక మార్కెట్ వద్ద మెయిన్‌రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. అంగన్‌వాడీలకు రిటైర్‌మెంట్ నాటికి సగం జీతం పెన్షన్‌గా చెల్లించాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు రొంగల ఈశ్వరరావు, పాకలపాటి సోమరాజు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు శ్రీలక్ష్మి, ఎం.సత్యవతి, బి.కృపావతి, రాజ్యలక్ష్మి, అమ్మాజీ పాల్గొన్నారు.